నమస్తే తెలంగాణ
మంచిర్యాల
కుమ్రం భీం ఆసిఫాబాద్
5 | మంగళవారం 9 జనవరి 2024 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD



కెరమెరి మండల కేంద్రంలో అక్షింతల శోభాయాత్రకు తరలివచ్చిన భక్తులు

# భీమన్న దేవునికి మొక్కులు

పూజలు చేస్తున్న గిరిజనులు



జన్నారం, జనవరి 8 : మండలంలోని కొత్తపేట గ్రామ పంచాయతీలోని కొలాంగూడలో మడావి, ఆదిమ కొలాం గిరిజనుల కులదైవం భీమన్న దేవునికి సోమవారం మొక్కులు చెల్లించుకున్నారు. మూడు రోజుల క్రితం ఆసిఫాబాద్ జిల్లా తిర్యాణి మండలం డోలిజెండాగూడ నుంచి కాలినడకన బయలుదేరిన గిరిజనులు సోమవారం ఇక్కడికి చేరుకొని భీమన్న దేవుని వద్ద ప్రత్యేక పూజలు చేశారు. గిరిజన సంప్రదాయం ప్రకారం కొత్త కోడళ్ల పరిచయ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మడావి బాపురావు, ఝూడు, ఆత్రం బొజ్జు, మాణిక్‌రావు, తదితరులు ఉన్నారు.

# జై శ్రీరామ్..

**నినాదాలతో మారుమోగిన కెరమెరి వీధులు**

- అక్షింతలతో భారీ శోభాయాత్ర
- తరలివచ్చి పూజలు చేసిన భక్తులు
- జీపీల వారీగా అక్షింతల పంపిణీ

కెరమెరి, జనవరి 8 : ఈ నెల 22న అయోధ్యలో శ్రీరాముని ఆలయం ప్రారంభోత్సవం సందర్భంగా సోమవారం మండల కేంద్రంలో నిర్వహించిన అక్షింతల శోభా యాత్ర అత్యంత వైభవంగా సాగింది. శ్రీ రామ జన్మభూమి క్షేత్ర ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ యాత్రకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ప్రత్యేక పూజలు చేశారు. బ్యాండ్ వాయిద్యాలు.. జై శ్రీరామ్ నినాదాలతో హోరెత్తించారు. వేంకటేశ్వర స్వామి ఆలయంలో పూజారి బాపుదేవ్ మహారాజ్ ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మండలంలోని 31 గ్రామపంచాయతీల సర్పంచ్‌లు, గ్రామప్రముఖులకు అక్షింతలు పంపిణీ చేశారు. భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు బోనగిరి సతీష్‌బాబు, కొనిపాక వేణుగోపాల్, కేంద్రే విశాల్, సిద్ధంశెట్టి సుహాసిని, వెంకటేశ్, ఆవిడపు ప్రణయ్, ఎంపీపీ పెందోర్ మోతీరాం, మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఆనంద్ రావ్, గ్రామప్రముఖులు గిత్తే గణేశ్, ఎల్లప్ప, రామారావ్, నాగుపటేల్, రామకృష్ణ, సెండే నారాయణ, తిరుపతి, కేంద్రే జగన్, రాథోడ్ ఉత్తం నాయక్, వాడై సుధాకర్ పాల్గొన్నారు.



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న జడ్పీ చైర్మన్ కోనేరు కృష్ణారావు

# విద్యార్థుల్లో క్రీడాస్ఫూర్తి నింపాలి

- జడ్పీ చైర్మన్ కోనేరు కృష్ణారావు
- ఆసిఫాబాద్‌లో ఎంపీపీ మల్లికార్జున్ ఆధ్వర్యంలో క్రీడా పోటీలు ప్రారంభం

ఆసిఫాబాద్, జనవరి8 : విద్యార్థుల్లో క్రీడాస్ఫూర్తి నింపాలని జడ్పీ చైర్మన్ కోనేరు కృష్ణారావు అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ఆదర్శ క్రీడాపాఠశాల మైదానంలో ఎంపీపీ అరిగెల మల్లికార్జున్ యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, అథ్లెటిక్స్ పోటీలను జడ్పీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షుడు అరిగెల నాగేశ్వర్‌రావు, డీటీవో పద్మ, డీడీ రమాదేవితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కృష్ణారావు మాట్లాడుతూ అరిగెల సోదరులు సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలతో పాటు క్రీడా పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. మూడు రోజుల పాటు నిర్వహించే ఈ క్రీడల్లో మొత్తం 136 టీమ్‌లు పాల్గొననున్నట్లు ఎంపీపీ తెలిపారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ అలీబిన్‌హైమద్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గంధం శ్రీనివాస్, నాయకులు వెంకన్న, గోపాల్ నాయక్, శంకర్, శ్రీనివాస్, పెంటయ్య, నిజాం, పరీక్షల నిర్వహణాధికారి ఉదయ్‌బాబు, జిల్లా క్రీడల అధికారి మీనారెడ్డి, పీడీలు, పీఈటీలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

.. మరిన్ని జిల్లా వార్తలు 8లో

# సీవోఈ పిలుస్తోంది

**గురుకుల కళాశాలల్లో ఇంటర్ ప్రవేశాలకు నోటిఫికేషన్**

- రాష్ట్ర వ్యాప్తంగా 38 కాలేజీల్లో 3,680 సీట్లు
- ఈ నెల 15వ తేదీ వరకు ఆన్‌లైన్ దరఖాస్తుల స్వీకరణ
- ఫిబ్రవరి 4న కామన్ ఎంట్రన్స్ టెస్ట్

బెల్లంపల్లి రూరల్, జనవరి 8 : నిరుపేద విద్యార్థులు గురుకులాల్లో చేరేందుకు సదావకాశం వచ్చింది. సంక్షేమ గురుకులాలకు వన్నె తెస్తున్న సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీ (సీవోఈ) కళాశాలల్లో జూనియర్ ఇంటర్మీడియెట్ ప్రవేశాలకు కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ (టీఎస్‌డబ్ల్యూఆర్ సీవోఈ సెట్ 2024) నోటిఫికేషన్ వెలువడింది. ఇంగ్లిష్ మీడియంతో పాటు తెలుగు మీడియం చదువుకున్న నిరుపేద విద్యార్థులు కూడా ఈ కామన్ ఎంట్రన్స్ టెస్ట్‌ను రాయవచ్చు. ఎంపీసీ, బైపీసీ,ఎంఈసీ, సీఈసీ గ్రూపులు అందుబాటులో ఉన్నాయి. ఎంపీసీ, బైపీసీ గ్రూపుల వారికి ఇంటర్మీడియెట్ బోధనతో పాటుగా ఐఐటీ, నీట్‌లాంటి ప్రవేశ పరీక్షలకు సీవోఈల్లో ప్రత్యేకమైన శిక్షణ ఇస్తారు. ఆంగ్లంలో బోధన ఉంటుంది. సెకండ్ లాంగ్వేజ్ తెలుగు మాత్రమే ఉంటుంది. బాల బాలికలకు వేర్వేరుగా సీవోఈ కళాశాలలు ఉన్నాయి.

## సీట్ల వివరాలు

రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 38 సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్సీ (సీవోఈ)లలో మొత్తం 3680 సీట్లు అందుబాటులో ఉన్నాయి. బాలురకు 1680 సీట్లు, బాలికలకు 2000 సీట్లు అందుబాటులో ఉన్నాయి. ఇందులో ఎస్సీ కేటగిరికి 75 శాతం, ఎస్సీ కన్వర్టెడ్ క్రిస్టియన్లకు 2 శాతం, ఎస్టీలకు 6 శాతం, బీసీలకు 12 శాతం, మైనార్టీలకు 3 శాతం, జనరల్, ఈబీసీ అభ్యర్థులకు 2 శాతం సీట్లు కేటాయించారు.

## బాలురకు..

రంగారెడ్డి జిల్లాలోని గౌలిదొడ్డిలో ఎంపీసీ, బైపీసీ గ్రూపులలో ఒక్కోదానిలో 120 చొప్పున మొత్తం 240 సీట్లు, ఇబ్రహీంపట్నంలో ఎంఈసీ, సీఈసీ గ్రూపుల్లో ఒక్కోదానిలో 40 చొప్పున మొత్తం 80 సీట్లు, సంగారెడ్డిలోని హత్నూరలో ఎంపీసీ, బైపీసీ గ్రూపుల్లో ఒక్కదానిలో 80 చొప్పున మొత్తం 160 సీట్లు, మిగిలిన అన్ని కళాశాలల్లో ఎంపీసీ, బైపీసీ గ్రూపుల్లో ఒక్కోదానిలో 40 సీట్లు అందుబాటులో ఉన్నాయి.

## బాలికలకు..

రంగారెడ్డి జిల్లాలోని గౌలిదొడ్డిలో ఎంపీసీ, బైపీసీ గ్రూపుల్లో ఒక్కోదానిలో 160 చొప్పున మొత్తం 320 సీట్లు, ఖమ్మంలో ఎంపీసీ, బైపీసీ గ్రూపుల్లో ఒక్కోదానిలో 80 చొప్పున మొత్తం 160 సీట్లు, కిస్టాపూర్, మేడ్చల్‌లో ఎంపీసీ, బైపీసీ గ్రూపుల్లో ఒక్కోదానిలో 40 చొప్పున మొత్తం 80 సీట్లతో పాటు మిగిలిన అన్ని కళాశాలల్లో ఎంపీసీ, బైపీసీ గ్రూపుల్లో ఒక్కోదానిలో 40 సీట్లు అందుబాటులో ఉన్నాయి. ఇందులో గౌలిదొడ్డి,నార్సింగి, మహేంద్రహిల్స్(బాలికల కళాశాల)లతో పాటు, గౌలిదొడ్డి, చిలుకూరు,షేక్‌పేట (బాలుర కళాశాలలు), కరీంనగర్ అల్గునూరు (కో-ఎడ్యుకేషన్)తో కలిపి మొత్తం 7 సీవోఈలను ప్రీమియర్ కళాశాలలుగా పరిగణిస్తారు. కామన్ ఎంట్రన్స్‌టెస్ట్‌లో రాష్ట్ర స్థాయిలో మెరిట్ సాధించిన వారికే ఈ కళాశాలల్లో ప్రవేశాలు కల్పిస్తారు. మిగిలినవన్నీ నాన్ ప్రీమియర్ సీవోఈలు. ఈ కళాశాలల్లో కూడా మెరిట్ ఆధారంగా సీట్లు కేటాయిస్తారు.

## అర్హతలు

ప్రస్తుతం పదో తరగతి (టెన్త్ క్లాస్) పరీక్షలకు సన్నద్ధం అవుతున్న విద్యార్థులు కామన్ ఎంట్రన్స్ టెస్ట్‌కు దరఖాస్తు చేసుకోవచ్చు. అయితే మొదటిసారే పదో తరగతి పాస్ అవ్వాలి. 2024 ఆగస్టు 31 నాటికి 17 సంవత్సరాలు ఉండాలి. ఎస్సీ,ఎస్టీ,కన్వర్టెడ్ క్రిస్టియన్లకు రెండేళ్లు మినహాయింపు ఉంటుంది. కుటుంబ వార్షిక ఆదాయం గ్రామీణ ప్రాంత అభ్యర్థులకు రూ. 1.50 లక్షలు, పట్టణ ప్రాంత అభ్యర్థులకు రూ.2 లక్షలకు మించకుండా ఉండాలి.



బెల్లంపల్లి సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీ

## పరీక్ష విధానం ఇలా..

ఇందుకు సంబంధించిన పరీక్ష ఫస్ట్‌లెవల్,సెకండ్ లెవల్ విధానంలో నిర్వహిస్తారు. ప్రశ్నా పత్రాలు ఇంగ్లిష్, తెలుగు మాధ్యమాల్లో ఇస్తారు. ఒక్కో టెస్ట్ సమయం మూడు గంటలు ఉంటుంది. 8వ తరగతి నుంచి పదో తరగతి వరకు నిర్దేశించిన సిలబస్ ఆధారంగా ప్రశ్నలు అడుగుతారు. ఫస్ట్ లెవల్ పరీక్ష ఆబ్జెక్టివ్ తరహాలో ఉంటుంది. మొత్తం 160 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలుంటాయి. ఒక్కో ప్రశ్నకు ఒక్కో మార్కు చొప్పున 160 మార్కులు కేటాయిస్తారు.

## ఎంపీసీ పరీక్ష పేపర్‌లో..

ఇంగ్లిష్ నుంచి 20, మ్యాథమెటిక్స్ నుంచి 20, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయోసైన్స్ నుంచి ఒక్కోదానిలో 40 ప్రశ్నలుంటాయి.

## ఎంఈసీ, సీఈసీ పేపర్‌లో..

ఇంగ్లిష్ నుంచి 20, మ్యాథమెటిక్స్ నుంచి 40, సోషల్ నుంచి 70, జనరల్ నాలెడ్జ్, కరెంట్ అఫైర్స్ నుంచి 30 ప్రశ్నలు ఇస్తారు. సమాధానాలను ఓఎంఆర్ పత్రం మీద మాత్రమే గుర్తించాలి. తప్పుగా గుర్తించిన సమాధానాలకు పావుమార్కు చొప్పున నెగెటివ్ మార్కులు ఉంటాయి. ఇక ఎంఈసీ, సీఈసీ అభ్యర్థులకు ఫస్ట్ లెవల్ టెస్ట్‌లో సాధించిన మెరిట్ ఆధారంగా అడ్మిషన్ (ప్రవేశం) కల్పిస్తారు. ఎంపీసీ, బైపీసీ అభ్యర్థులు మాత్రం సెకండ్ లెవల స్క్రీన్‌టెస్ట్ రాయాల్సి ఉంటుంది. ఫస్ట్ లెవల్ టెస్ట్‌లో సాధించిన మార్కుల ఆధారంగా ఒక్క సీటుకు ఐదుగురు చొప్పున (1:5) ఎంపిక చేసి సెకండ్ లెవల్ టెస్ట్‌కు అనుమతిస్తారు. ఈ పరీక్ష డిస్క్రిప్టివ్ తరహాలో ఉంటుంది. మ్యాథ్స్, బయోసైన్స్, ఫిజిక్స్,కెమిస్ట్రీల నుంచి ఒక్కోదానిలో 45 మార్కులతో పాటు ఇంగ్లిష్‌తో కలిపి మొత్తం 150 మార్కులు ఉంటాయి.

## ఫీజు వివరాలు

కామన్ ఎంట్రన్స్ టెస్ట్‌కు దరఖాస్తు చేసుకునే విద్యార్థులు రూ.200 ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకునేందుకు 2024 జనవరి 15వ తేదీ వరకు అవకాశం కల్పించారు. హాల్‌టికెట్లను జనవరి 25 నుంచి ఫిబ్రవరి 3 వరకు డౌన్‌లోడ్ చేసుకునే అవకాశం కల్పించారు. తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 4న కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ నిర్వహిస్తారు. ఇతర వివరాల కోసం tsswreiajc.cgg.gov.in ,www.tswreis.ac.in వెబ్‌సైట్‌లలో అభ్యర్థులు సంప్రదించవచ్చు.

### పేద విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలి



*తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ గ్రామీణ పేద విద్యార్థులకు ఉన్నత విద్యావకాశాలు కల్పిస్తున్నది. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 38 కళాశాలల్లో 3,680 సీట్లకు దరఖాస్తులు తీసుకుంటుంది. గురుకుల సీవోఈల్లో అందుతున్న నాణ్యమైన విద్యను సక్రమంగా వినియోగించుకుంటే బంగారు భవిష్యత్‌కు పునాదులు వేసుకున్నట్లే. కళాశాలల్లో చేరాలనుకునే పేద విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలి. ప్రీవియస్ ప్రశ్నాపత్రాలు, ఇతర వివరాల కోసం దగ్గరలోని సీవోఈల ప్రిన్సిపాళ్లను సంప్రదించవచ్చు.* **- కొప్పుల స్వరూపారాణి, రీజినల్ కోఆర్డినేటర్**

# కాసిపేట-2 ఇంక్లైన్ గని మైనింగ్ సర్దార్ మృతి

- గత నెల 21న కాలుజారి పడడంతో గాయాలు
- చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచిన మచ్చ రమేశ్
- గని ప్రమాదంగా గుర్తించి పరిహారం ఇవ్వాలని సంఘాల డిమాండ్



మచ్చ రమేశ్(ఫైల్)

కాసిపేట, జనవరి 8 : మందమర్రి ఏరియాలోని కాసిపేట-2 ఇంక్లైన్ గనికి చెందిన సీనియర్ మైనింగ్ సర్దార్ మచ్చ రమేశ్(32) గోదావరిఖని ఏరియా హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ మృతి చెందాడు. డిసెంబర్ 21న నైట్ షిఫ్ట్ విధులు ముగించుకొని నడుచుకుంటూ వస్తున్న క్రమంలో టబ్బు రేల్స్‌పై అడుగుపెట్టి జారి పడ్డాడు. కాలుకు తీవ్ర గాయం కాగా రామకృష్ణాపూర్ ఏరియా హాస్పిటల్‌కు తరలించారు. వైద్యులు కాలు విరిగిందని నిర్ధారించారు. అక్కడి నుంచి గోదావరిఖని ఏరియా హాస్పిటల్‌కు తీసుకొచ్చి చేర్పించగా, చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. సరైన వైద్యం అందించకపోవడం వల్లే రమేశ్ మృతి చెందినట్లు కార్మిక సంఘాల నాయకులు ఆరోపిస్తున్నారు. గని ప్రమాదంగా గుర్తించి కార్మిక కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తున్నారు. యువ కార్మికుడి మృతితో గనిపై విషాదం నెలకొంది. రమేశ్‌కు భార్య, ఇద్దరు పిల్లలున్నారు.

# గంజాయి కేసులో ముగ్గురి బైండోవర్

హాజీపూర్, జనవరి 8 : మండలంలోని పెద్దంపేట గ్రామానికి చెందిన దుర్గం రాజ్‌కుమార్, కర్ణమామిడి గ్రామానికి చెందిన మంద హృతిక్, చిట్యాల సుధాకర్‌ను గంజాయి కేసులో సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట బైండోవర్ చేసినట్లు హాజీపూర్ ఎస్‌ఐ నరేశ్‌కుమార్ తెలిపారు. గంజాయి అక్రమ రవాణాకు పాల్పడితే జైలు శిక్ష అనుభవించక తప్పదని ఆయన హెచ్చరించారు. రామగుండం పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.


# పార్లమెంట్ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

- ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి
- రాంగనర్‌లో బీఆర్‌ఎస్ కార్యకర్తలతో సమావేశం



బీఆర్‌ఎస్ కార్యకర్తలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి

జైనూర్, జనవరి 8 : రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ గెలుపే లక్ష్యంగా పనిచేయాలని ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవలక్ష్మి పేర్కొన్నారు. సోమవారం మండలంలోని రాంనగర్‌లో బీఆర్‌ఎస్ కార్యకర్తలు, నాయకులతో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ మండలంలో జరిగే అభివృద్ధి పనులకు కార్యకర్తలు, నాయకులు సహకరించాలని కోరారు. అనంతరం తొడసం సీతారాం స్మారక క్రికెట్ పోటీలను ప్రారంభించారు. జిల్లా స్థాయి నుంచి రాష్ట్రస్థాయికి ఎంపికైన క్రీడాకారులను అభినందించారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ కొడప హన్నూ పటేల్, సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు మడావి భీంరావ్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు ఇంతియాజ్ లాలా, జైనూర్ సర్పంచ్ మెస్రం పార్వతి-లక్ష్మణ్, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు కుమ్ర భగవంత్‌రావ్, మోహన్, కెరమెరి జడ్పీటీసీ, లింగాపూర్ బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు ఆత్రం అనిల్ తదితరులున్నారు.



నృత్యం చేస్తున్న జిల్లా కళాకారులు

# రాష్ట్ర స్థాయి యువజనోత్సవాల్లో జిల్లా కళాకారుల ప్రతిభ

**హైదరాబాద్‌లో** సోమవారం నిర్వహించిన రాష్ట్ర స్థాయి యువజనోత్సవ పోటీల్లో జిల్లా కళాకారులు కొండ అశ్విత, కొమ్ముల కీర్తన, దెబ్బటి అశ్విత, ఆశ్రిత, గోని మేఘన, రొడ్డ ఆశ్రిష, కల్లెం అర్పిత, ఆదిమూలం భార్గవి, మెరుగు సాత్విక్, మహ్మద్ ఇర్ఫాన్ అలీ ప్రతిభ చూపారు. యువజన సర్వీసుల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీల్లో ఫోక్ డ్యాన్స్ విభాగంలో మొదటి స్థానంలో నిలిచారు. *- మంచిర్యాల అర్బన్, జనవరి 8*



సీసీసీ డంపుయార్డు నుంచి వెలువడుతున్న పొగ

# సీసీసీని కమ్మేసిన పొగ

- స్థానిక డంపుయార్డులో ఆదివారం రాత్రి చెలరేగిన మంటలు
- అదుపులోకి తీసుకొచ్చిన ఫైర్, సింగరేణి సిబ్బంది
- పలు కాలనీలను చుట్టేయడంతో అవస్థలు
- శ్వాసతీసుకోలేక ఉక్కిరిబిక్కిరి అయిన ప్రజలు
- సమస్యకు పరిష్కారం చూపాలని వేడుకోలు

సీసీసీ నస్పూర్, జనవరి 8 : సీసీసీ నస్పూర్ డంపుయార్డును పొగ కమ్మేసింది. ఆదివారం రాత్రి ఒక్కసారిగా మంటలు చెలరేగి దట్టమైన పొగ వ్యాపించింది. ఫైర్ సిబ్బంది హుటాహుటిని అక్కడికి చేరుకొని మంటలను అదుపులోకి తీసుకువచ్చింది. సోమవారం ఉదయం సైతం సింగరేణి వాటర్ ట్యాంకర్ల ద్వారా నీటిని చల్లి మంటలు చల్లార్చారు. సీసీసీ టౌన్‌షిప్ నుంచి సీసీసీ కార్నర్, తాళ్లపల్లి, సింగాపూర్ పునరావాసకాలనీ, నాగార్జునకాలనీ, గోదావరికాలనీ షిర్కే, తదితర ప్రాంతాలను పొగ చుట్టేసింది. సమీపంలో ఉన్న చర్చి, మసీదు, పోలేరమ్మ, మడేలయ్య, పోచమ్మ గుడి పొగతో నిండుకుంది. రాత్రి నుంచి ఉదయం వరకు పొగ కమ్మేయడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బంది అయ్యింది. ప్రజలు శ్వాస తీసుకోలేని పరిస్థితిలో ఉక్కిరిబిక్కిరి అయ్యారు. ముఖ్యంగా డంపుయార్డుకు సమీపంలోగల ఆశ్రమంలోని వృద్ధులతో పాటు ఆస్తమా రోగులు తిప్పలు పడ్డారు. ఇది వరకు ఇక్కడ సింగరేణి పోగు చేసిన చెత్తను మాత్రమే పోసేవారు. ఇప్పుడు నస్పూర్ మున్సిపాలిటీకి సంబంధించిన తడి..పొడి చెత్తను ఇక్కడికే తీసుకొస్తున్నారు. గుట్టలు గుట్టలుగా చెత్త పోగవుతుండగా, తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఇక్కడి నుంచి వెలువడుతున్న పొగ వల్ల శ్వాసకోస వ్యాధులు వచ్చే ప్రమాదముందని, అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి ఈ సమస్యకు పరిష్కారం చూపాలని ప్రజలు వేడుకుంటున్నారు.

# గ్రీన్‌ఫీల్డ్ హైవేను రీ డిజైన్ చేయాలి

- ప్లాట్ల యజమానుల డిమాండ్
- క్యాతనపల్లిలో రహదారిపై రాస్తారోకో
- పోలీసుల జోక్యంతో విరమణ



క్యాతనపల్లి రహదారి పై రాస్తారోకో చేస్తున్న బాధితులు

రామకృష్ణాపూర్, జనవరి 8 : ఆర్మూర్ నుంచి క్యాతనపల్లి వరకు నిర్మించనున్న గ్రీన్‌ఫీల్డ్ హైవేతో తమ ప్లాట్‌లు కోల్పోతున్నామని, వెంటనే రీడిజైన్ చేసి తమకు నష్టం జరుగకుండా చూడాలని పలువురు యజమానులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలోని ఎంఎన్‌ఆర్ గార్డెన్ సమీపంలో రహదారిపై రాస్తారోకో చేశారు. గంటపాటు ఆందోళన చేపట్టడంతో మంచిర్యాల, బెల్లంపల్లి వైపు వెళ్లాల్సిన వాహనాలు పెద్ద సంఖ్యల నిలిచిపోయాయి. దిగువ, మధ్య తరగతి కుటుంబాలకు చెందిన తాము అష్టకష్టాలు పడి ప్లాట్‌లు కొనుగోలు చేశామని, ఇప్పుడు గ్రీన్‌ఫీల్డ్ హైవేతో తాము అవి కోల్పోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. సమాచారమందుకున్న రామకృష్ణాపూర్ పోలీసులు అక్కడికి చేరుకొని వారికి నచ్చజెప్పడంతో ఆందోళన విరమించారు. అనంతరం మంచిర్యాల కలెక్టర్ కార్యాలయానికి చేరుకొని వినతి పత్రం అందించారు.

# ప్రజా సమస్యలు పరిష్కరించాలి

**ఆసిఫాబాద్ కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు**

ఆసిఫాబాద్, జనవరి 8 : ప్రజా సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో జిల్లా అదనపు కలెక్టర్ దాసరి వేణుతో కలిసి దరఖాస్తులు స్వీకరించారు. జిల్లాలోని ఆశ్రమ పాఠశాలల ఏఎన్‌ఎంలు ప్రభుత్వ గిరిజన సంక్షేమ శాఖ పరిధిలోని ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాల్లో పొరుగు సేవల పద్ధతిన తమను విధుల్లోకి తీసుకోవాలని దరఖాస్తు అందజేశారు. కాగజ్‌నగర్ పట్టణంలోని కీజర్‌నగర్‌కు చెందిన రజియా బేగం తనకు వితంతు పింఛన్ మంజూరు చేయాలని అర్జీ అందించారు. కాగజ్‌నగర్ పట్టణానికి చెందిన కొట్రంగి స్వరూప తన ఎడమచేతి 4 వేళ్లు ముడుచుకొని ఉంటాయని, సదరం సర్టిఫికెట్‌లో సున్న శాతంగా వచ్చిందని, మరొకసారి అవకాశం కల్పించాలని కోరుతూ దరఖాస్తు సమర్పించారు. కాగజ్‌నగర్ పట్టణంలోని పెట్రోల్ పంపు ఏరియాకు చెందిన దివ్యాంగుడు భేటీ విజయ్‌కుమార్, వాంకిడి మండలం ఖిరిడి గ్రామానికి చెందిన జాడి సునీత ఉపాధి కల్పించాలని కోరుతూ దరఖాస్తులు అందజేశారు. పెంచికల్‌పేట మండలం కమ్మర్గాం గ్రామానికి చెందిన చెన్నూరి చిన్నక్క సదరం సర్టిఫికెట్ అందించి.. దివ్యాంగ పింఛన్ ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. జైనూర్ మండలం జంగావు కిషన్ నాయక్ తండాకు చెందిన రాథోడ్ శంకర్ తన భార్య దూరిబాయి పేరిట ఉన్న భూమిని ఆమె మరణించిన తర్వాత తనకు తెలియకుండా తన కుమారులు పట్టా చేసుకున్నారని, ఈ విషయమై విచారించి తనకు న్యాయం చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. వాంకిడి మండలం గోయగాం గ్రామానికి చెందిన దుర్వాసగుప్త బసు తమ ఊరిలో అంగన్‌వాడీ పోస్టు ఖాళీగా ఉందని, తనకు అవకాశం కల్పించాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు. వాంకిడి మండలం నవగూడ గ్రామానికి చెందిన శంకర్ తనకు సదరం సర్టిఫికెట్ ఇపిపచాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు.



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ హేమంత్ సహదేవరావు

అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ దరఖాస్తులను పరిశీలించి సంబంధిత అధికారుల సమన్వయంతో పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు.